క్లుప్తంగా

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

నగరంపాలెం: గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో ఏఆర్ పోలీస్ కానిస్టేబుల్(పీసీ)గా విధులు నిర్వర్తించే మంగళగిరి ద్వారకానగర్‌కు చెందిన సోమేశ్వరరావు(42) కామెర్లతో బాధపడుతున్నాడు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు రూ.25 వేలను అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం మృతుడి భార్య మాధవికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు మైల సాంబశివరావు, సంయుక్త కార్యదర్శి లక్ష్మణ్, సభ్యులు కరిముల్లా, హుస్సేన్ పాల్గొన్నారు.

పరిశ్రమలపై బడ్జెట్ ప్రభావం

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమలపై కేంద్ర బడ్జెట్ ప్రభావం వివిధ రూపాల్లో ఉందని ఏఎన్‌యూ అర్థశాస్త్ర విభాగ ప్రొఫెసర్ సీఎస్ఎన్ రాజు అన్నారు. శనివారం అమరావతి రోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో పరిశ్రమలపై కేంద్ర బడ్జెట్ ప్రభావం అనే అంశంపై విశ్లేషణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర కె.లలిత, అధ్యాపకులు డి. కళ్యాణి, సీహెచ్ వైష్ణవి, సీహెచ్ వేదవతి, ఏ.బాజీబాబు, మణికంఠ, అభిలాష్ పాల్గొన్నారు.

ఖాతాదారులకు ఉత్తమ సేవలు

నగరంపాలెం: హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా శనివారం గుంటూరు నగరంలోని శ్రీపద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో ఫిల్, స్పిన్ అండ్ విన్ ప్రారంభించారు. మహారత్న ఓఎంసీ రిటైల్ అవుట్‌లెట్ నెట్‌వర్క్‌లో కస్టమర్ సర్వీస్‌లో అత్యుత్తమ సేవలు, ఆనందాన్ని అందించేందుకు సిద్ధంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ సెంట్రల్ జోన్ చీఫ్ జీఎం బెన్నీ సి థామస్, చీఫ్ రీజినల్ మేనేజర్ ఆదిత్య ఆనంద్ పాల్గొన్నారు.


ప్రతిభను ప్రోత్సహించాలి

గుంటూరు మెడికల్: ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా శనివారం గుంటూరు వైద్య కళాశాల మైక్రో బయాలజీ వైద్య విభాగంలో ఎంబీబీఎస్ విద్యార్థులకు పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికి తోడ్పడతాయన్నారు. వైద్య కళాశాలలో విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, బోధనా సిబ్బంది డాక్టర్ వాణిశ్రీ, డాక్టర్ శివమ్మ, డాక్టర్ కాత్యాయని, డాక్టర్ లీనా, డాక్టర్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

నగరంపాలెం: పాత, కొత్త చట్టాలపై మరింత అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఎల్ఏ) వ్యవస్థాపక అధ్యక్షులు, తెలంగాణ హైకోర్టు న్యాయవాది చింతల శ్రీకాంత్ అన్నారు. ఐఎల్ఏ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు జెడ్పీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నేర చట్టాలు ప్రాథమిక భావన, కొత్త నేరాల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకి ఐఎల్ఏ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.శాంతకుమార్ అధ్యక్షత వహించారు. విశ్రాంత డీడీ, ఏపీ హైకోర్టు న్యాయవాది ఎస్ఆర్ఏ రోజ్‌దార్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బ్రహ్మేశ్వరరావు, మణి, సురేష్ పాల్గొన్నారు.

సిటీ బస్సుల తనిఖీ



నెహ్రూ నగర్: గుంటూరు నగరంలో తిరుగుతున్న ప్రైవేట్ సిటీ బస్సులను శనివారం సాయంత్రం ఆర్టీఏ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఫిర్యాదుల మేరకు 20 సిటీ బస్సులపై కేసులు నమోదు చేసినట్లు డీటీసీ షేక్ కరీం తెలిపారు. అందులో డ్రైవర్ లైసెన్సులు లేకుండా నాలుగు కేసులు, ఇన్సూరెన్స్ లేని వాహనాలపై ఒక కేసు, మల్టీ హారన్ కలిగిన వాహనాలపై ఏడు కేసులు, ఇతర నిబంధనలు ఉల్లంఘించినందుకు 8 కేసులు నమోదు చేశారు. తనిఖీలలో ఆర్టీఏ అధికారులు జి గోపాల్, రాఘవరావు, అనిల్, బాలకృష్ణ, సౌజన్య మల్లీశ్వరి, ఉషా కిరణ్, పవన్, మధుసూదన్‌రావు, అమృతరాణి పాల్గొన్నారు.

మస్తాన్‌వలికి సన్మానం

లక్ష్మీపురం: జనరల్ ఇన్సూరెన్స్‌లో ఉద్యోగ విరమణ చేసిన మస్తాన్‌వలి సేవలు మరువలేనివని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వి. రాధాకృష్ణ మూర్తి అన్నారు. స్థానిక కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లోని శనివారం ఉద్యోగ విరమణ సభ శనివారం నిర్వహించారు.

కేంద్ర బడ్జెట్‌పై 'అవగాహన'

లక్ష్మీపురం: కేంద్ర బడ్జెట్‌లోని నిశితంగా పరిశీలిస్తే దేశ ప్రజల జీవితాలపై ఏ మాత్రం ప్రభావం చూపని సాధారణ బడ్జెట్ అని అర్థమవుతుందని, అర్థశాస్త్రశాఖాధిపతి డాక్టర్ పి.వేణుగోపాల్ అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలంయలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ విశ్లేషణ ఆర్థికవేత్త పి.సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్థికవేత్త, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రాజశేఖర్ మాట్లాడారు.

హెపటైటిస్ వెరీ డేంజర్

- స్క్రీనింగ్ పరీక్షలతో గుర్తించవచ్చు
- వ్యాధి సోకకుండా అందుబాటులో వ్యాక్సిన్
- నేడు వరల్డ్ హెపటైటిస్ డే



'తెనాలికి చెందిన 30 ఏళ్ల రమేష్ ప్రతిరోజూ మద్యం తాగే అలవాటుతో తన ఆరోగ్యంపై దృష్టి సారించలేదు. తనకేమి సమస్య లేదని పట్టించుకోలేదు. ఒకరోజు కళ్లు పసుపురంగులోకి మారిపోయి ఆరోగ్యం బాగాలేదని గ్యాస్ట్రో ఎంట్రాజిస్టుల వద్దకు వెళ్లాడు. వైద్యులు పరీక్షలు చేసి లివర్ పూర్తిగా పాడైందని, లివర్ మార్పిడి చేసిన బతకటం కష్టమని చెప్పటంతో కుటుంబ సభ్యులు ఖంగుతిన్నారు'.

గుంటూరు మెడికల్: హెపటైటిస్ వ్యాధి ప్రాణాంతకం. ప్రపంచ ఆరోగ్య సంస్థ 2022 నివేదిక ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా హెపటైటిస్-బి, హెపటైటిస్-సి వ్యాధితో 304 మిలియన్ల మంది బాధపడుతున్నట్లు అంచనా. 1.3 మిలియన్ల మంది క్రానిక్ హెపటైటిస్‌తో చనిపోయారు. ప్రతిఏడాది ప్రతి 30 సెకన్లకు ప్రపంచ వ్యాప్తంగా ఒకరు హెపటైటీస్ సంబంధిత వ్యాధితో మరణిస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వ్యాధి సోకినవారిలో 90 శాతం మంది ప్రజలకు వ్యాధిపై, వైద్య చికిత్సలపై అవగాహన లేదు. దీంతో వరల్డ్ హెల్త్ అసెంబ్లీ 2010 నుంచి జూలై 28వ తేదీని హెపటైటిస్ డేను నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు వ్యాధి బారిన పడకుండా 2030 నాటికి వ్యాధి లేని ప్రపంచాన్ని తీర్చి దిద్దటమే లక్ష్యంగా హెపటైటిస్ డేను నిర్వహిస్తున్నారు.

కాలేయంతో...

హెపటైటిస్ కాలేయానికి సంబంధించిన వ్యాధి. హెపటైటిస్ బి వైరస్ ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని కలుగచేసే వైరస్ శరీరంలోకి ఒకసారి వస్తే క్రమేపి వైరస్‌ల సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. వ్యాధిలోఎ, బి, సి, డి, ఇ రకాలు ఉన్నా వాటిలో బి, సి ప్రాణాంతకం. సుమారు లక్ష 50 మంది హెపటైటిస్ బాధితులు ఉండవచ్చని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు చెబుతున్నారు.

వ్యాధి సోకే విధానం...

ఇన్‌ఫెక్ట్ అయిన రక్తపు ఉత్పత్తుల ద్వారా, శరీరంలో ఊరే వివిధ ద్రవాల ద్వారా(వీర్యం, యోని స్రవాలు, మూత్రం) సురక్షితం కాని సంభోగం ద్వారా, అనేక మందితో సంభోగం చేయటం ద్వారా ఒకరికి వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడటం ద్వారా, టాటూలు వేసుకోవటం, ముక్కు, చెవి కుట్టులు, ఒకరేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం, ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం, అసురక్షితమైన రక్తదానం ద్వారా, వైరల్ కలిగి ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెపటైటీస్-బి, సి వ్యాధులొస్తాయి. వ్యాధి సోకిన వారిలో తమకు వ్యాధి ఉన్నట్లు ఏ విధమైన లక్షణాలు కనిపించకపోవటంతో వారి ద్వారా ఇతరులకు వ్యాధి సోకుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా ఈ వ్యాధి అందరికి సోకుతుంది. హెచ్‌బీఎస్ఏజీ పరీక్ష ద్వారా వ్యాధి సోకిందా లేదా అని నిర్ధారణ చేస్తారు.

వ్యాధి లక్షణాలు...

కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది. కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు. వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించటం, వాంతులవ్వటం, వ్యక్తి బాగా బలహీనపడటం, కీళ్ల నొప్పులు ఉంటాయి. కొంత మంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. కాలేయం సరిగా పనిచేయక మృత్యువుకు దారితీస్తుంది.

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం...

గుంటూరు జీజీహెచ్‌లో 2021 నుండి ప్రత్యేకంగా హెపటైటిస్ స్క్రీనింగ్ సెంటర్ ద్వారా ఉచితంగా వైద్యసేవలు అందిసుస్తున్నారు. స్క్రీనింగ్ సెంటర్ ప్రారంభం నుండి ఈ ఏడాది జూన్ వరకు 30,542 మందికి హెపటైటిస్ బి అనుమానంతో పరీక్షలు చేయగా 1265 మందికి ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. హెపటైటిస్ సీ స్క్రీనింగ్ పరీక్షలు 19,736 మందికి చేయగా 465 మందికి ఉన్నట్లు వైద్య పరీక్షల్లో తేలింది. ఈ సెంటర్‌లో హెపటైటిస్ నియంత్రణ, నివారణ కోసం ఉచితంగా వ్యాక్సిన్లు, మందులు, వైద్యసేవలు అందిస్తున్నారు.

హెపటైటిస్‌కు వ్యాక్సిన్‌తో చెక్‌పెట్టవచ్చు



హెపటైటిస్- బి వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. ఈ వ్యాధికి వ్యాక్సిన్ ఉంది కాని వ్యాధి వచ్చాక నయం కాదు. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు వ్యాక్సిన్లు చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా కాపాడుకోవచ్చు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు. హెపటైటిస్-సి వ్యాధికి వ్యాక్సిన్ లేదు కాని వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేయవచ్చు.

డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి, గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్‌లో హెపటైటీస్‌ను ముందస్తుగా గుర్తించి చికిత్స అందించేందుకు స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నాం. ప్రత్యేక హెపటైటీస్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని 2020 నవంబరులో ప్రారంభించాం. పరీక్షలు ప్రతిరోజూ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఓపీ విభాగంలో ఉచితంగా చేస్తున్నాం. వైద్య పరీక్షలు చేసి హెపటైటీస్ నిర్ధారణ అయిన వారికి నెలకు సుమారు రూ.20 వేలు ఖరీదు చేసే మందులు ఉచితంగా అందిస్తున్నాం. హై రిస్క్ గ్రూపునకు చెందిన ప్రతి ఒక్కరూ ముందస్తుగా వ్యాక్సిన్ వేయించుకోవడం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

– డాక్టర్ నాగూర్‌బాషా, అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్యాస్ట్రోఎంట్రాలజి, జీజీహెచ్

లివర్ క్యాన్సర్‌కు దారితీస్తోంది



లివర్ క్యాన్సర్లు రావటానికి హెపటైటిస్- బి, సి వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా హెపటైటిస్ వ్యాధి ఉందా లేదా అని తప్పనిసరిగా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి. శరీరంలో హెపటైటీస్ ఆరు నెలల కంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటీస్‌కు దారితీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినటానికి కారణమవుతుంది. దీని వల్ల లివర్ క్యాన్సర్, లివర్ ఫెయిల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది.

డాక్టర్ భైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్యనిపుణులు, గుంటూరు.

అలరించిన సినీ సంగీత విభావరి



రమణిను సత్కరించిన అతిథులు

నగరపాలెం: స్థానిక అమరావతి రోడ్డు అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఆర్.ఎస్. ఈవెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షురాలు మునిపల్లె రమణి ఆధ్వర్యంలో శనివారం ఏకగళంతో మునిపల్లె రమణి 58 (అర్ధ నూట పదహారు) పాటల సినీ సంగీత విభావరి నిర్వహించారు. పత్రి లలిత్‌బాబు గీతాలకు సహకారం అందించారు. తొలుత డ్రీమ్ ఆడియోస్ అధ్యక్షులు చావ నరసింహారావు (విజయవాడ) జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిరి సంగీత విభావరి వీనుల విందుగా జరగ్గా, ప్రేక్షకులను అలరించింది. కీబోర్డుపై రవి, జెర్మియా, తబలపై రమణ, విజయ్‌పాల్, ప్యాడ్స్ పై లక్ష్మణ్ వాయిద్య సహకారాన్ని అందించారు. అనంతరం మునిపల్లె రమణిను అతిథులు శాలువాతో సత్కరించారు.

హోంగార్డు కుటుంబానికి చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరపాలెం: జిల్లా పోలీస్ శాఖలో హోంగార్డుగా విధులు నిర్వర్తించే ఎస్.భాస్కర్ ఇటీవల విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. ఈ మేరకు బాధితుడికి హోంగార్డుల ఒక రోజు వేతనం విరాళం కింద వచ్చిన రూ.2.32 లక్షల చెక్కును భాస్కర్ భార్య రాజశ్రీకి శనివారం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ)లో జిల్లా ఎస్పీ కె.సతీష్‌కుమార్ అందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ శాంతకుమార్, హోంగార్డు ఇన్‌చార్జి ఆర్. శ్రీనివాస రావు, ఆర్ఎస్ఐ రత్నరాజు, హోంగార్డు రైటర్ సుధీర్ పాల్గొన్నారు.

అంకితభావంతో నగర అభివృద్ధికి కృషి

బదిలీపై వెళ్తున్న కమిషనర్ కీర్తి చేకూరి



కీర్తి చేకూరిని సన్మానిస్తున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

నెహ్రూ నగర్: గుంటూరు నగర కమిషనర్‌గా సంతృప్తిగా విధులు నిర్వహించామని, విధి నిర్వహణలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో నగర అభివృద్ధికి కృషి చేశామని ఏపి ట్రాన్స్ కో జెఎండిగా బదిలీ అయిన కీర్తి చేకూరి అన్నారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బదిలీ అయిన కీర్తి చేకూరికి అధికారులు, ప్రజా ప్రతినిధులు వీడ్కోలు, అభినందన సభ నిర్వహించారు. నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో కీర్తి చేకూరి మాట్లాడుతూ గుంటూరు నగర కమిషనర్ గా రెండేళ్ల 3 నెలల కాలం ఎంతో సంతృప్తిగా విధులు నిర్వహించామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు నగర అభివృద్ధికి ఎంతగానో సహకరించారని, ప్రధానంగా రోడ్ల విస్తరణ, కాలనీల్లో పార్క్ ల అభివృద్ధికి కృషి చేశామన్నారు. నగరపాలక సంస్థ ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా కల్పించడం తనకు వ్యక్తిగతంగా ఎంతో సంతోషాన్ని అందించిందని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ మాట్లాడుతూ కీర్తి చేకూరి సమర్థంగా పనిచేశారని కొనియాడారు. గుంటూరు అర్బన్ ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ మాట్లాడుతూ కీర్తి తమకు బ్యాచ్ మేట్ అని, విధి నిర్వహణలో అందరినీ కలుపుకొని, తను అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ పి.రోజా, డెప్యూటీ మేయర్ షేక్ సజిలా, ఇన్‌చార్జి కమిషనర్ శ్యాం సుందర్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంహెచ్ఓ మధుసూదన్, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ వీవీ నాయుడు పేర్కొన్నారు. శనివారం అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో విద్యార్థులకు హెల్మెట్ వాడకంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో తూర్పు, పశ్చిమ ట్రాఫిక్ సీఐలు బి.కోటేశ్వరరావు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గంజాయిపై ఉక్కుపాదం మోపాలి

ఎస్పీకి ఎమ్మెల్యే మాధవి వినతి



నగరంపాలెం: గుంటూరు నగరంలో యువత, ప్రజల జీవితాలను నాశనం చేస్తున్న గంజాయిపై కఠినంగా వ్యవహరించాలని పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. ఈ మేరకు జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో శనివారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌కు ఎమ్మెల్యే మాధవి వినతిపత్రం అందించారు. గుంటూరు ప్రగతికి సవాలుగా మారిన గంజాయికి ఆడ, మగ తేడా లేకుండా బానిసలవుతున్నారని, ఇది సమాజ శ్రేయస్సుకు మంచిది కాదన్నారు. బానిసైన వారు విచక్షణ మరిచి సామాన్య ప్రజానీకంపై దాడులకు తెగబడుతున్నారని అన్నారు. కొందరూ ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఈ మేరకు గంజాయి తాగే ప్రాంతాల వివరాలను వినతిపత్రంలో పేర్కొన్నారు. బైక్‌ల పోటీలు, అర్ధరాత్రులు పుట్టిన రోజు వేడుకలు, అనుమానిత వ్యక్తులు సంచరిస్తున్నారని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని, నగరంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను క్రమబద్ధీకరించాలని కోరారు.

ప్రతిభావంతులకు సహకారం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రతిభావంతులు పేదరికంతో చదువుకు దూరం కారాదని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(అవోపా) రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబు పేర్కొన్నారు. శనివారం అరండల్‌పేటలోని అవోపా కార్యాలయంలో నీట్, ఎంసెట్, ఇంటర్మీడియెట్‌లలో అత్యంత ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాంబాబు మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆగస్టు 25న రూ.20 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మట్టుపల్లి రవికుమార్ విద్యార్థులకు రూ.లక్ష నగదుతో ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర కార్యదర్శి రాచపూడి సుబ్బారావు, అవోపా నగర అధ్యక్షుడు కేవీ బ్రహ్మం, అరుణ్‌కుమార్, నంబూరు శివనాగేశ్వరరావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు చింతా కృష్ణారావు, నగర కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సుబ్బారావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ మద్ది సాయిరమేష్ పాల్గొన్నారు.

దంపతులపై దాడిచేసిన వారిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో దంపతులపై దాడిచేసిన ముగ్గురిపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. చుట్టుగుంట ప్రాంతంలో నివాసం ఉండే మొగలి ప్రశాంతి, పోలేరమ్మ వద్ద నాలుగు సంవత్సరాల క్రితం రూ.లక్ష తీసుకుంది. వడ్డీ చెల్లిస్తూ వస్తుంది. అయితే వడ్డీతో పాటు, అసలు చెల్లించాలని పోలేరమ్మ, ప్రశాంతిని నిలదీసింది. ఈనేపథ్యంలో ఇరువురి మధ్య గొడవ జరిగింది. పోలేరమ్మ, ఆమె కుమారుడు రాజు, సమీప బంధువు మహాలక్ష్మి ముగ్గురు కలిసి ప్రశాంతి, ఆమె భర్త మురళీకృష్ణలపై దాడిచేసి గాయపరిచారు. బాధితురాలు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇంటి యజమానిపై దాడి చేసి చోరీ

గుంటూరు ఈస్ట్: చోరీకి ప్రయత్నించిన ఇద్దరు, ఇంటి యజమాని తలపై కర్రతో దాడిచేసి పరారైన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. వెంకటరమణ కాలనీలో శ్రీనివాసరావు శుక్రవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. ఇంటి తలుపు రేకుది కావడంతో చోరీకి వచ్చిన ఇద్దరూ తలుపును బలవంతంగా తెరిచి లోపలకు ప్రవేశించారు. అలికిడికి శ్రీనివాసరావు లేచి ఇద్దరిని అడ్డుకోగా, ఇరువురిలో ఒకరు కర్రతో శ్రీనివాసరావు తలపై బలంగా కొట్టి టేబుల్‌పై ఉన్న సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యాడు. బాధితుడు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టెంబర్ నుంచి ఏఐటీయూసీ జాతీయ మహాసభలు

లక్ష్మీపురం: ఏఐటీయూసీ జాతీయ సమితి సమావేశాలు సెప్టెంబర్ 1,2,3 తేదీలలో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి అన్నారు. స్థానిక కొత్తపేటలోని జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడారు. సమావేశంలో భవనిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్ల చిన్న ఆంజనేయులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం విద్యార్థులకు ఆదర్శం



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు యశ్వంత్

లక్ష్మీపురం: అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తి అని ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు ఎ.యశ్వంత్ పేర్కొన్నారు. స్థానిక బీసీ హాస్టల్‌లోని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం అబ్దుల్ కలాం వర్ధంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు భగత్ సింగ్ పవన్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గుంటూరు మెడికల్: అబ్దుల్‌కలాంను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూపూడి గంగరాజు అన్నారు. భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా మైనార్టీ మోర్చా ఆధ్వర్యంలో షేక్ సాంబశివరావు అధ్యక్షతన ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి శనివారం నిర్వహించారు. టీజేపీఎస్ కాలేజీలో అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, జూపూడి రంగరాజు హాజరయ్యారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అబ్దుల్ ఖుద్దూస్, షేక్ రఫీ, నరేంద్ర కుమార్ షా, షేక్ బిలాల్, షేక్ బాషా, హేమంత్ జైన్, కొక్కెర శ్రీనివాస్, పార్టీ నాయకులు తాడువాయి రామకృష్ణ, తిరుపతి రావు, మనోహర్ పాల్గొన్నారు.

ఆగస్టు 7న హలో బీసీ – చలో అమృత్‌సర్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: దేశంలో వెనుకబడిన తరగతులకు చెందిన ఓబీసీల సమస్యలు, రాజకీయ భవిష్యత్‌పై ఆగస్టు 7న హలో బీసీ.. చలో అమృత్‌సర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తెలియజేశారు. అఖిల భారత ఓబీసీ 9వ మహాసభ ఆగస్టు 7న పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో జరుగుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను శనివారం చుట్టుగుంటలోని బీసీ సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నిర్వహించే జనగణనలో సమగ్ర కులగణనను జరిపి, బీసీల కుల గణన లెక్క తేల్చాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ ప్రయివేట్ రంగంలోనూ, న్యాయమూర్తుల నియామకాలలోనూ ఎస్సీ, ఎస్టీల ఇస్తున్న రిజర్వేషన్లు మాదిరిగానే ఓబీసీలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు తన్నీరు ఆంజనేయులు, కొల్లూరు హనుమంతురావు, పారేపల్లి మహేష్, శివరాం, కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి కృషి చేయాలి

లక్ష్మీపురం: భూ వివాదాల పరిష్కారానికి, బలహీన వర్గాల ఆస్తుల పరిరక్షణలపై రెవెన్యూ విభాగం దృష్టి సారించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు కోరారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో శనివారం జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజను కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసన శంకరావు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల భూ సంబంధ పత్రాలను, ఓబీసీలకు అవసరమైన సర్టిఫికెట్లు మంజూరు చేయడంలో, దిగువ స్థాయి రెవెన్యూ అధికారులు జాప్యం చేస్తున్నారన్నారు. తగు చర్యలు తీసుకొని వెంటనే ప్రజలందరికీ ధ్రువీకరణ పత్రాలు అందేలా చూడాలని కోరారు. జేసీ భార్గవ తేజను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు కేసన స్వాములు పాల్గొన్నారు.









